క్లుప్తంగా

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు చక్రవర్తుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్న ప్రసాదం స్వీకరించారు. అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి భక్తులు పోటెత్తారు.

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు, వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కోర్టు నిర్వహణ

సఖినేటిపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం అమలాపురం ఆర్డీవో ఎస్.వసంత రాయుడు సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ కోర్టును నిర్వహించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న, కలిగించే వారిపైన పోలీసులు 107, 109 చట్టాల కింద నమోదు చేసిన కేసులపై ఆర్డీవో విచారణ చేశారు. ఈ ఏడాది ఒక ఎంసీ కేసుకు సంబంధించి 38 మందితోను, మరొక ఎంసీ కేసుకు సంబంధించి ఏ–పార్టీ 8 మందితోను, బీ–పార్టీ 7 మందితోను ఆర్డీవో కోర్టులో ఆయన విచారణ నిర్వహించారు. తహసీల్దార్ వై.రామకుమారి, డీటీ సీహెచ్ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వి.రామరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దు

అంబాజీపేట: బాల్య వివాహాలను ప్రోత్సహించకుండా వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు అన్నారు. ముక్కామలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్‌వీ మహాలక్ష్మి ఆధ్వర్యంలో పోషక విలువల స్టాల్‌ను శనివారం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ చిన్న తనంలోనే వివాహాలు చేసుకుంటే వచ్చే సమస్యలు, ఇబ్బందులపై అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించి చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వనచర్ల దుర్గ, వాసంశెట్టి పెదబాబు, బండారు మల్లి, దేవరపల్లి చినబాలయోగి, కోట విజయరాజు, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

ఆలమూరు: చెముడులంకలోని వివిధ ప్రాంతాల్లో సీసీ, డ్రైనేజీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గడపగడపకు మన ప్రభుత్వంలో కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.40 లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తమ్మన శ్రీనివాసు శనివారం తెలిపారు. ఇప్పటికే రూ.10 లక్షలతో స్థానిక ఎస్సీ పేటలో డ్రైనేజీని పూర్తి చేయగా మళ్లీ రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, దొండపాటి చంటి తదితరులు పాల్గొన్నారు.

గోపాలమిత్ర కుటుంబానికి పరామర్శ

అంబాజీపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోపాలమిత్ర నవుండు శివశంకర్ కుటుంబాన్ని అతని స్వగ్రామమైన వాకలగరువులో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ మాదిగ శనివారం పరామర్శించారు. శంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పించి అతని ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అతని కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

పురాతన నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శన

మలికిపురం: స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో చరిత్ర టూరిజం విభాగం ఆధ్వర్యంలో 'పురాతన నాణేలు, కరెన్సీ ఎగ్జిబిషన్‌ని శనివారం ఏర్పాటు చేశారు. వృత్తి రీత్యా గ్రేడ్ వన్ హిందీ పండిట్ అయిన తాడి వినోద్ సేకరించిన అపురూపమైన పురాతన నాణేలను కరెన్సీ నోట్లను ఇందులో ప్రదర్శించారు. సుమారు 200 దేశాల నాణేలను సేకరించి ప్రదర్శించారు. ఈ నాణేల ప్రదర్శనను దాదాపు 800 మంది వీక్షించారు. ఈ ప్రదర్శన నేటి తరానికి ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ సతీష్ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాత్విక్ జోడీ విజయంపై హర్షం

కొత్తపేట: ఆసియా క్రీడల బ్యాడ్మింటన్ డబుల్స్‌లో మొట్టమొదటిసారిగా బంగారు పతకం సాధించిన కోనసీమ యువకుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ జోడీ విజయంపై స్థానిక పూర్వ క్రీడాకారులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. సాత్విక్, చిరాగ్ జంట కొరియా జోడీపై గెలిచి భారత కీర్తిపతాకాన్ని ఎగురవేశారని పూర్వ క్రీడాకారుడు, కళాసాహితీ సభ్యుడు షేక్ గౌస్ అన్నారు. సాత్విక్ తండ్రి, కాశీ స్వగ్రామం కొత్తపేట మండలం వాడపాలెం. తల్లి ఇందిరది కొత్తపేట. ప్రస్తుతం వారు అమలాపురంలో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా గౌస్ తన తన ఆంధ్రా ఆప్టికల్స్ వద్ద బంగారు పతకాలు సాధించిన సాత్విక్, చిరాగ్ శెట్టి ఫొటోలతో వారికి అభినందనలు తెలుపుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. స్థానికంగా పలువురు క్రీడాకారులు, పూర్వ క్రీడాకారులు సాత్విక్ విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

- రోగులకు మెడికల్ కిట్ల పంపిణీ
- పాల్గొన్న మంత్రి కొట్టు, ఎమ్మెల్యేలు చిర్ల, కొండేటి

ఆత్రేయపురం: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనే దృఢ సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్షను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని, పౌరులందరికీ ఇంటి వద్దే ఉచిత వైద్య పరీక్షలు, మందులు ఇస్తారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలో మండల ప్రజా పరిషత్ పాఠశాల వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో ప్రజలందరికీ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటళ్ల వైద్యులు ఉచిత సేవలు అందిస్తారన్నారు. గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి ఆరోగ్యశ్రీకి పూర్వ వైభవం తెస్తూ కేన్సర్ వంటి రోగాలకు కూడా ఆరోగ్యశ్రీలో ఉచిత చికిత్స అందిస్తున్నారని, ఆరోగ్యశ్రీ ద్వారా 3257 చికిత్సలను 2285 ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చన్నారు. కేవలం తెల్ల రేషన్‌కార్డు వారికి మాత్రమే కాకుండా రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశామన్నారు. క్యాంపులను విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది, అధికారులను అభినందించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. అనంతరం లొల్లలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, అలాగే వాడపల్లిలో రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకేని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. అప్పనపల్లిలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.



లొల్లలో జగనన్న సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



ముక్కామలలో రోగులకు మెడికల్ కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ బొంతు నీలిమ, పీఏసీఎస్ చైర్మన్లు గెద్దం కృష్ణమూర్తి, కటకంశెట్టి ఆదిత్యకుమార్, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ముక్కామలలో సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి అధ్యక్షతన డీటీ పి.నాగపద్మలక్ష్మి పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ 2369 మందికి 720 మంది రోగులను గుర్తించి టోకెన్‌లను వైద్య సిబ్బంది అందించారన్నారు. మెడికల్ క్యాంపునకు 378 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ వనచర్ల దుర్గ, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురంలో సురక్ష కార్యక్రమం శనివారం స్థానిక సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డీఎంహెచ్‌వో భరతలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసురావు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి హాజరయ్యారు. జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమంతో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారన్నారు. శిబిరంలో 490 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఆలమూరు: సురక్ష శిబిరం ప్రజలకు ఎంతో మేలు చేస్తోందని కొత్తపేట అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. చొప్పెల్ల గ్రామ సచివాలయం–2 పరిధిలోని నవాబుపేటలో సర్పంచ్ సూరంపూడి ముత్యాలమ్మ, తహసీల్దార్ ఐపీ శెట్టి ఆధ్వర్యంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు జరిగింది. సుమారు 120 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, వైద్యారోగ్య సిబ్బంది అందించిన సేవలు సంతృప్తికరంగా ఉన్నట్లు శిబిరానికి పరిశీలనకు వచ్చిన అదనపు జిల్లా వైద్యాధికారి సుమలత వ్యాఖ్యానించారు. పంచాయతీ కార్యదర్శి అయ్యన్న, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్ పి.శివప్రసాద్, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలోని ఇరుసుమండలో శనివారం ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. సర్పంచ్ వల అమ్మాజీ శిబిరం ప్రారంభించి మాట్లాడుతూ సీఎం జగన్ పేదలకు ఉచిత వైద్యంపై చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నారని అన్నారు. అందరికీ సంపూర్ణ వైద్యం అందించాలని ఉద్దేశంతో వందకుపైగా వైద్య పరీక్షలు వ్యాధులకు సంబంధించి 105 రకాల పరీక్షలను ఈ శిబిరాల్లో నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అవులపాటి శివజ్యోతి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొంబత్తుల బాబురావు, తహసీల్దార్ ఎల్.నరసింహారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, చింత రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా నిలపాలన్నది లక్ష్యంగా ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు అన్నారు. వాడపాలెంలో శనివారం ఆరోగ్య సురక్ష శిబిరాన్ని అముడా చైర్మన్ డేవిడ్‌రాజు, వివిధ విభాగాలను ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ప్రారంభించారు. వానపల్లి పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో ఇతర వైద్యులు, సిబ్బంది శిబిరానికి వచ్చిన ప్రజలకు వివిధ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిట్టిబాబు అన్నారు. మండలంలోని రాజులపాలెం గ్రామ సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 412 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంబత్తుర ఏసుబాబు, డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ భారతి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాజోలు: ములికిపల్లి సచివాలయ పరిధిలో స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 440 మంది రోగులకు మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ గుబ్బల నీలిమ, తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.బాలాజీ, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, బండారు కాశీ పాల్గొన్నారు.



నవాబుపేటలో సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి సుమలత



వాడపాలెం శిబిరంలో వైద్య సేవలు పరిశీలిస్తున్న అముడా చైర్మన్ డేవిడ్‌రాజు తదితరులు



ములికిపల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర

అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం

రాజోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం కల్పించారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. శనివారం శివకోడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాపాక నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే రాపాకకు సర్పంచ్ నక్కా రామారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. శివకోడు పల్లిపాలెం, లాకు సెంటర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఆర్థిక అసమానతలు తొలగించేందుకు సంక్షేమ పథకాలతో పాటు రాజకీయంగా, సామాజికంగా ముందంజలో నిలిపేందుకు అనేక రాజ్యాంగ, నామినేటెడ్ పదవులను కేటాయించారన్నారు. మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, పార్టీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, మాజీ ఎంపీపీ పాలపర్తి ధనలక్ష్మి, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, మట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



శివకోడులో మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

అభివృద్ధి, సంక్షేమంపై ఇంటింటికీ ప్రచారం

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. చాకలిపాలెం ఫంక్షన్ హాల్లో శనివారం జరిగిన మామిడికుదురు సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం త్వరలో ప్రారంభమవుతుందన్నారు. జగన్ పాలనకు గత ప్రభుత్వ పాలనకు తేడాను స్పష్టంగా ప్రజలకు వివరించాలని చిట్టిబాబు సూచించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ముందుకు వెళ్లాలన్నారు. నాలుగున్నరేళ్లలో పి.గన్నవరం నియోజకవర్గంలో గణనీయమైన అభివృద్ధిని సాధించామన్నారు. 75 సచివాలయాలకు రూ.15 కోట్లు గడప గడపకు నిధులు, జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.100 కోట్లు, ఊడిమూడిలంక బ్రిడ్జికి రూ.24 కోట్లు ఈ విధంగా ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. వీటిని ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతుల్ని చేయాలని చిట్టిబాబు సూచించారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు పి.చిట్టిరాజు, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు పాల్గొన్నారు.



మామిడికుదురు మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

సీసీ డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ డ్రైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: స్థానిక బైపాస్ రోడ్డులో సీసీ డ్రైన్ నిర్మాణ పనులను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శనివారం ప్రారంభించారు. సీసీ డ్రైన్ నిర్మాణ పనుల కోసం రూ.14 లక్షల నిధులను ఎమ్మెల్యే రాపాక కేటాయించారు. దీంతో సీసీ రోడ్డు వెంబడి డ్రైన్ నిర్మాణం చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, దార్ల పెదబాబు, ఏడుకొండలు, బండారు కాశీ, అడబాల జానకీరామ్ పాల్గొన్నారు.

స్కూళ్లకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

మామిడికుదురు: రాజోలు నియోజకవర్గ పరిధిలోని 24 స్కూళ్లకు స్పోర్ట్స్ కిట్లను శనివారం జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి పంపిణీ చేశారు. మామిడికుదురులో జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో 4 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాల, ఒక యూపీ స్కూల్‌తో పాటు 23 మండల పరిషత్ స్కూల్స్‌కు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. జెడ్పీటీసీ, ఎంపీపీలు మాట్లాడుతూ విద్యతో క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, ఎంపీటీసీ వర్ధినేని రాము, గ్రామశాఖ అధ్యక్షుడు కంచి శ్రీరామ్ పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, ఆహారం పంపిణీ

కొత్తపేట/రావులపాలెం: చల్లగాలి సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం పేదలకు దుస్తులు, ఆహారం పంపిణీ చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ మెజీషియన్, చల్లగాలి సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ చైర్మన్ చల్లగాలి శ్రీనివాస్‌వర్మ సంస్థ ద్వారా పేదలకు వివిధ రూపాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. దానిలో భాగంగా శనివారం శ్రీనివాస్‌వర్మ–కల్యాణి దంపతులు తమ కుమారుడు, దివంగత ఇంజినీరింగ్ విద్యార్థి శోభిత్‌వర్మ వర్ధంతి సందర్భంగా రావులపాలెం, కొత్తపేటలో సుమారు 200 మంది నిరుపేదలకు దుస్తులు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. శ్రీనివాస్‌వర్మ మాట్లాడుతూ మెజీషియన్‌గా సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక రుగ్మతలను పారదోలడంతో పాటు తమ సేవా సంస్థ ద్వారా చేస్తున్న సేవలు తమ కుమాడు శోభిత్‌వర్మపై ఎంతగానో ప్రభావం చూపాయన్నారు. శోభిత్ స్మృతిలో తమ వంతు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అనంతరం ఇటీవల ప్రముఖ సంస్థల పురస్కారాలు, డాక్టరేట్ పొందిన పురోహితుడు పెద్దింటి రామచంద్రశ్రీహరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో సేవా సంస్థ సభ్యులు అక్షర, రుత్విక్‌వర్మ, ఎ.అశోక్, జూనియర్ సినీ ఆర్టిస్టు పెద్దింటి కృష్ణవంశీ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు భోజనం ప్యాకెట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసవర్మ, కల్యాణి దంపతులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఆత్రేయపురం: మండలంలోని లొల్ల గ్రామంలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు తూము కాశీ విశ్వనాథం, తూము తాతాజీ, దాట్ల సూర్యనారాయణరాజు తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ వెళ్లి వివరించారు. లబ్ధిదారులకు గణాంకాలతో సహా వివరించి మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందని వారితో మాట్లాడుతూ అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ నేరుగా తమ ఖాతాలకే జమ అవుతున్నాయని ప్రజలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వద్ద హర్షం వ్యక్తం చేశారు. రజక వీధిలో రజకుల కమ్యూనిటీ హాలు ప్రహరీకి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీడీఓ నాతి బుజ్జి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వెలిచేరులో మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

పి.గన్నవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదేశించారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే అంశంపై చాకలిపాలెంలోని కృష్ణ బాలాజీ కన్వెన్షన్ హాలులో శనివారం మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ కమిటీల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. విప్లవాత్మకమైన మార్పులతో గ్రామ స్థాయికి పరిపాలన అందుబాటులోకి తీసుకువచ్చారని అన్నారు. సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, వడలి కొండ, పార్టీ రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, పితాని నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అయినవిల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని మండలంలోని అడిషనల్ డీఎంహెచ్‌వో భరతలక్ష్మి అన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్ అడిషనల్ అండ్ డీఎంహెచ్‌వో భరతలక్ష్మి, సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి ప్రారంభించారు. పోషకాహారంతో రోగాలను తరిమికొట్టవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్.సునీల్, క్రిష్టోఫర్, వైఎస్సార్ సీపీ నాయకులు మేడిశెట్టి శ్రీనివాస్, మట్టపర్తి రామారావు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ పోరాటానికి సిద్ధం కావాలి

మామిడికుదురు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు మామిడికుదురు బస్టాండు కూడలిలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద శనివారం విశ్వరూప పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రస్తుత శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి దాన్ని చట్టబద్ధం చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో విశ్వరూప పాదయాత్ర చేపడుతున్నామని ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.సత్యనారాయణ చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్ నుంచి మాదిగ, అనుబంధ కులాల ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ విశ్వరూప పాదయాత్ర చేపట్టారని చెప్పారు. నవంబరు 4న హైదరాబాద్‌లో జరిగే మాదిగ, అనుబంధ కులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు సిర్రా శ్రీనివాసరావు, లూటుకుర్తి శ్రీనివాసరావు, ముస్కూడి కిరణ్‌కుమార్, పెదపూడి మణికంఠ, మంద గాంధీ, చేట్ల సత్యనారాయణ, చుట్టుగుళ్ల బుజ్జిబాబు పాల్గొన్నారు.

కృష్ణమ్మ వారసుల గుర్తింపునకు వినతి

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ వారసులైన తమకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరుతూ శనివారం ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు, ఓడలరేవుకు చెందిన కొపనాతి శ్రీనివాసరావు, అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. కృష్ణమ్మ వారసులుగా తమకు ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్‌గా నియమించమని కోరుతున్నామని, ఇంత వరకూ దీనిపై ఎటువంటి చర్యలు లేవన్నారు. రాబోయే స్వామి కల్యాణ మహోత్సవాలకు ఆయన విగ్రహాన్ని ఆవిష్కరణకు అనుమతితో పాటు, ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్‌గా కృష్ణమ్మ వారసులకు అవకాశం ఇచ్చే విధంగా చూడాలని ఏసీ సత్యనారాయణను వారు ఆ పత్రంలో కోరారు. శ్రీనివాసరావుతో పాటు నాయకులు తిరుమాని ఆచార్యులు, సీహెచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహం పరిశీలన

కొత్తపేట: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని వెంకటరామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నెలకొల్పనున్నారు. ఈ విగ్రహం కొత్తపేట వుడయార్ శిల్పశాలలో రూపుదిద్దుకుంటోంది. అనేక యూనివర్సిటీల్లో నెలకొల్పిన వైఎస్సార్ విగ్రహాలు నిలువెత్తువి కాగా, ఉద్యాన విశ్వవిద్యాలయానికి మాత్రం విభిన్నంగా యోగముద్రలో ఉన్న విగ్రహం రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ ఆ విగ్రహం నమూనా రూపొందించగా గతంలోనే మంత్రి పరిశీలించారు. ఈ విగ్రహం తయారీ పురోగతిని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శనివారం మరోసారి పరిశీలించారు. శిల్పికి పలు సూచనలు చేశారు. ఏడున్నర అడుగుల ఎత్తున విగ్రహాన్ని, త్వరితగతిన రూపొందించాలని కోరారు. వారి వెంట అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యుడు కె.ధర్మరాజు, ఎంపీటీసీ సభ్యుడు చావలి సుబ్బరాయశాస్త్రి తదితరులు ఉన్నారు.



వైఎస్సార్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, విప్ జగ్గిరెడ్డి తదితరులు

ఆశ కార్యకర్తల ధర్నా

మామిడికుదురు: పని ఒత్తిడికి గురై జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో మృతి చెందిన ఆశ వర్కర్ పేపూడి కృపమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ లూటుకుర్రు పీహెచ్‌సీ వద్ద ఆశ కార్యకర్తలు శనివారం ధర్నా చేశారు. చనిపోయిన ఆశ కార్యకర్త కుటుంబానికి రూ.50 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని, ఆమె మృతి కారణమైన ఉద్యోగులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున, డి.సువర్చలాదేవి, శిరీష ఆధ్వర్యంలో ఆలమూరు–2, కలవచర్ల, పినపళ్ల, సంధిపూడి, జొన్నాడ శివారు మూలాటి రేవు, చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు.